విద్యలో ప్రత్యేక చొరవ చూపాలి : ఐటీడీఏ పీవో

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 17: గిరిజన పిల్లల చదువు అభివృద్ధి చెందాలంటే వారిని సొంత పిల్లల్లా భావించి పదో తరగతిలో వెనుకబడిన పిల్లలకు చక్కటి విద్య అందించేలా చొరవ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ స్పెషలాఫీసర్లను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రత్యేక అధికారులు, ఏటీడీవోలతో ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనా తీరుపై, పది ఫలితాలపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డేవిడ్‌రాజ్, మణెమ్మ, విజయలక్ష్మి, చంద్రశేఖర్, రమణయ్య, రాములు, జహీరుద్దీన్, చంద్రమోహన్, అశోక్‌కుమార్, రాధమ్మ పాల్గొన్నారు.

కరెంట్ సౌకర్యం లేని పంటభూములకు సోలార్ విద్యుత్

లక్ష్మీదేవిపల్లి, జనవరి 17 : ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో కరెంట్ సౌకర్యం లేని పంట భూముల్లో బోర్వెల్ వేసుకొని ప్రత్యామ్నాయంగా సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని సంవత్సరానికి రెండు పంటలు పండించుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొజ్జలగూడెం, లక్ష్మీపురం, బంగారు చెలక గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు.

తక్కువ ఖర్చుతో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : మోకాళ్ల శస్త్రచికిత్సలో రోబోటిక్ పద్ధతి అందుబాటులో ఉందని, తక్కువ ఖర్చులో చేస్తున్నామని డాక్టర్ సునీల్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కొత్తగూడెంలో పుట్టానని, ఈ ప్రాంతావాసులకు అతి తక్కువ ఖర్చులో చికిత్స అందిస్తానని అన్నారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న తాను వారానికి ఒకసారి కొత్తగూడెం వస్తున్నానన్నారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

పాల్వంచ, జనవరి 17 : పాల్వంచలోని డిజిటల్ గ్రంథాలయాన్ని మున్సిపల్ కమిషనర్ సుజాత శుక్రవారం సందర్శించారు. బీఆర్ఎస్‌వీ పట్టణ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ వినతి మేరకు గ్రంథాలయాన్ని సందర్శించి తగిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ డీఈ స్వరూపరాణి, ఏఈ రాము, పాఠకులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 'మొబలైజేషన్' ప్రారంభం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 17 : ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మానసిక, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించుకునేలా సాధన చేయాలని కొత్తగూడెం డీఎస్పీ షేన్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఆర్ సిబ్బందికి 'మొబలైజేషన్ పరేడ్' కార్యక్రమం ప్రారంభమైంది.

మున్సిపల్ కమిషనర్ వాహనానికి తప్పిన ప్రమాదం

ఇల్లెందు, జనవరి 17: ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ప్రయాణిస్తున్న కారుకు ఎదురుగా బ్రేకులు ఫెయిల్ అయిన లారీ వచ్చి ఢీకొన్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు నుంచి టేకులపల్లి వైపు వస్తున్న కమిషనర్ వాహనానికి ఇల్లెందు వైపు వెళ్తున్న లారీకి బ్రేకులు ఫెయిల్ అయి ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో కారు స్వల్పంగా ధ్వంసం కాగా కారులో ఉన్న కమిషనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

బూర్గంపహాడ్ : వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

బూర్గంపహాడ్, జనవరి 17: ప్రభుత్వ పథకాల అమలు కోసం చేపట్టిన ఫీల్డ్ వెరిఫికేషన్ సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని సోంపల్లి, లక్ష్మీపురం, పినపాక పట్టినగర్, మోరంపల్లిబంజర్, ఇరవెండి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వేలో నిరుపేదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అర్హులకు అన్యాయం జరగకుండా పారదర్శకంగా సర్వే జరగాలన్నారు.

అశ్వారావుపేట, జనవరి 17: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కోసం చేపట్టిన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కొత్తగూడెం ఆర్డీవో డి.మధుసూధన్ స్పష్టం చేశారు. సర్వేను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని నారంవారిగూడెం గ్రామ పంచాయతీ లో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు.

దమ్మపేట, జనవరి 17: రైతుభరోసాకు సంబంధించి మండలంలో వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వాణి సిబ్బందితో కలిసి శుక్రవారం సర్వే నిర్వహించారు.

మణుగూరు టౌన్, జనవరి 17: ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులు సర్వే సిబ్బందిని సూచించారు.

అన్నపురెడ్డిపల్లి, జనవరి 17: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు.

చండ్రుగొండ, జనవరి 17: ప్రభుత్వ పథకాలపై అధికారుల బృందాలు గ్రామ పంచాయతీల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. శుక్రవారం తుంగారంలో ఎంపీడీవో అశోక్ సర్వేను పర్యవేక్షించారు.

ఇల్లెందు రూరల్, జనవరి 17: మండల పరిధిలోని భోయితండా పంచాయతీలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

టేకులపల్లి, జనవరి 17: ప్రభుత్వం పథకాల అమలు కోసం మండలంలో జరుగుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్ రోడ్, కోయగూడెం, టేకులపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను వారు పరిశీలించారు.

దుమ్ముగూడెం, జనవరి 17: మండల పరిధిలోని సున్నంబట్టి పంచాయతీలో లంక ప్రదేశంలో శుక్రవారం పడవ సహాయంతో సర్వే బృందం వెళ్లి సర్వే నిర్వహించారు.

పాల్వంచ రూరల్, జనవరి 17 : అర్హులైన లబ్ధిదారుల వివరాలు అన్ని యాప్‌లో పొందుపర్చాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పునుకుల పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల సర్వే తీరును పరిశీలించారు.

జూలూరుపాడు, జనవరి 15: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వే కార్యక్రమాన్ని మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీవో తోట తులశీరాం పేర్కొన్నారు. మండలంలోని కాకర్ల గ్రామంలో సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు.

ప్రతి నీటి చుక్క సాగుకు ఉపయోగపడాలి

మాట్లాడుతున్న మువ్వా విజయ్ బాబు, పక్కన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు, జనవరి 17: ఇల్లెందులో ఏజెన్సీలో ప్రతి నీటి చుక్క సాగుకు ఉపయోగపడేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇరిగేషన్ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇల్లెందు నియోజకవర్గ స్థాయి ఇరిగేషన్ అధికారుల రివ్యూ సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో రైతుల సాగు విషయంలో వర్షపు నీరు వృథా కాకుండా వాగులు, కుంటలు, చెరువులకు మరల్చాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాట్లకు, ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు కావాల్సిన ప్రాంతాలను గుర్తించి సమాచారం అందజేయాలని సూచించారు. దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వడ్లపూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ మంజూరు చేయించాలి

ఇల్లెందు రూరల్, జనవరి 17: వ్యవసాయ పంటలు సమృద్ధిగా పండేందుకు గ్రామానికి చెక్ డ్యామ్ మంజూరు చేయించేలా కృషి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబును ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్ కోరారు.

ఇల్లెందు, జనవరి 17: ఇల్లెందు మున్సిపాటలిటీ పరిధి రెండో వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య రెండో వార్డు సభ్యురాలు కటకం పద్మావతితో కలిసి ఇల్లందులపాడులో స్థలాన్ని పరిశీలించారు.

సింగరేణి కాలుష్యానికి వ్యక్తి బలి

సత్తుపల్లి, జనవరి 17: సింగరేణి కాలుష్యంతో ఊపిరితిత్తులు దెబ్బతిని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారంలో చోటు చేసుకుంది. కిష్టారం అంబేద్కర్‌నగర్ కాలనీలో నివసిస్తున్న బుర్రా తుకారాం అలియాస్ రవీంద్ర (38)) గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. తుకారాం కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నాడు. తిరిగి గురువారం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో స్థానికులు అతడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అయితే తుకారాం గాంధీ ఆసుపత్రిలో చేరడానికి ముందు ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తన అనారోగ్యానికి పూర్తి బాధ్యత తమ కాలనీ ముందు సింగరేణి నిర్మించిన సైలోబంకరేనని ఆ వీడియోలో పేర్కొన్నాడు. ఆ బంకర్ నుంచి వెలువడే ధూళి, కాలుష్యం వల్లనే తన ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నదని అందులో వివరించారు. తమ కాలనీ వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని, సైలోబంకర్‌ను తొలగించాలని ఆ సెల్ఫీ వీడియోలో డిమాండ్ చేశాడు. కాగా, తుకారాంకు దివ్యాంగురాలైన భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. తుకారం తన సెల్ఫీ వీడియోలో చెప్పిన మాటలు కాలనీవాసులను కంట తడిపెట్టించాయి. ఈ కాలుష్యం సమస్యను పరిష్కరిస్తామని మాట ఇచ్చిన నాయకులు ఇప్పుడు తమను పట్టించుకోకపోవడంతోనే తుకారాం మృతిచెందాడని ఆరోపిస్తూ అతడి మృతదేహంతో గ్రామస్తులు, కాలనీవాసులు గ్రామంలోని రహదారిపై రాస్తారోకో చేశారు.

16కి పెరిగిన ఎన్‌కౌంటర్ మృతుల సంఖ్య

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 17 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారీ కాంకేర్ అడవుల్లో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య గురువారం జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో మృతుల సంఖ్య 16కి చేరింది. బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల డీఆర్‌జీ జవాన్లతోపాటు కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సుమారు 1,500 మంది బలగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సెర్చింగ్ ఆపరేషన్స్‌లో భాగంగా జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనలో మొత్తం 16 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి మొదలైన ఆపరేషన్‌లో సాయంత్రం 7 గంటల వరకు విడతలవారీగా కాల్పులు చోటు చేసుకున్నాయి. అయితే ఘటనా స్థలంలో భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందులో పార్టీ అగ్ర నాయకులు కూడా ఉన్నట్లు సమాచారం. సుమారు 3 వేల మంది భద్రతా దళాలు మావోయిస్టులు ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దీంతో భద్రతా దళాలు 16 మంది మావోయిస్టులను మట్టుబెట్టి ఘన విజయాన్ని సాధించారు. ఈ నెల 6న బీజాపూర్ జిల్లా కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేలి గ్రామ సమీపంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి 9 మంది జవాన్లు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా పది రోజుల వ్యవధిలోనే 16 మంది మావోయిస్టులను తుదముట్టించి పైచేయిగా నిలిచారు. దీంతో మావోయిస్టులు తలపెట్టిన భారీ ప్లీనరీ భగ్నమైనట్లు తెలుస్తున్నది. మృతిచెందిన వారిలో సోంబేడి అలియాస్ సోమిడి(ఏసీఎం డిప్యూటీ కమాండర్), కిశోర్(ఏసీఎం), లాలు(పార్టీ సభ్యుడు), సోని(ఏసీఎం), మున్న, హిదుమా అలియాస్ ఇడుమ అలియాస్ ఇర్మ, సాంట అలియాస్ శ్వేత, గంగి(ఏసీఎం), కోవాసి, రత్న, కుసబ అలియాస్ కేశవ, అండాలు(పార్టీ సభ్యురాలు), దవాజ అలియాస్ రజిత(పార్టీ సభ్యురాలు), శాంతి(పార్టీ సభ్యురాలు), మైను అలియాస్ సాంబు, రాములు అలియాస్ రాములు(పార్టీ సభ్యుడు) ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు గాయపడిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పూర్ జిల్లా గోర్పా గ్రామంలోని బీఎస్ఎఫ్ క్యాంప్ నుంచి రోడ్ ఓపెనింగ్ పార్టీ విధుల నిమిత్తం బయలుదేరింది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై అడుగు వేయడంతో అది భారీ విస్ఫోటనం చెందింది. దీంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. దీనిని గమనించిన తోటి జవాన్లు క్షతగాత్రులను క్యాంప్ వద్దకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రానికి తరలించారు.

భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, జనవరి 17: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపజేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

రామయ్యను దర్శించుకున్న దేవనాథ రామానుజ జీయర్

భద్రాచలం, జనవరి 17: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని శుక్రవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలైన శ్రీలక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను అర్చకులు తెలిపారు. అనంతరం చిత్రకూట మండపంలో భక్తులకు ప్రవచనం చేశారు.

అనాథ శరణాలయాల తనిఖీ

మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, జనవరి 17 : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి కొత్తగూడెంలో ఉన్న శ్రీస్నేహలత, సంధ్యలత పిల్లల, వృద్ధాశ్రమం, శ్రీజ్యోతి అనాథ వృద్ధాశ్రమం, శ్రీ సత్యసాయి అనాథ వృద్ధాశ్రమాలను సందర్శించి వారికి కల్పిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. సౌకర్యాలు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

భద్రాచలం, జనవరి 17: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం భద్రాచలంలో ఎంవీఐ వెంకటపుల్లయ్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. సీఐ సంజీవరెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్సై విజయలక్ష్మి, ట్రాఫిక్ పోలీసులు, పోలీసు, మోటార్ వెహికల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, జనవరి 17: నియోజకవర్గాన్ని ఒక వైపు అభివృద్ధి పనులతోను, మరో వైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని, ఇవి రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని వేదాంతపురం, గుర్రాలచెరువు, కేశప్పగూడెం గ్రామాల్లో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరంలో రూ.5లక్షలతో కల్వర్టుకు, కోయరంగాపురంలో రూ.10లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ప్రసాదరావు, ఐటీడీఏ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో చోరీలు

ఇల్లెందు రూరల్, జనవరి 17: ప్రభుత్వ కార్యాలయాలే టార్గెట్‌గా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. మూడు వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. పంచాయతీ కార్యదర్శి మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బొజ్జాయిగూడెంలోని హెల్త్ సబ్‌సెంటర్, పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. రోజూ మాదిరిగానే విధులు ముగించుకుని గేట్లకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం విధులకు హాజరయ్యేందుకు రాగా గేటు తాళాలు పగులగొట్టి ఉండడం, బీరువా తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మహబూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరు టౌన్, జనవరి 17: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.75 లక్షల విలువ చేసే చెక్కులను మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో కరకగూడెం మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం పంపిణీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో చిన్నారి మృతి

పాల్వంచ, జనవరి 17 : పాల్వంచ పట్టణంలోని నవభారత్ గాంధీనగర్‌లో శుక్రవారం మందా మేధశ్రీ(17 నెలలు) చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. 2020లో గాంధీనగర్‌కు చెందిన గండూరి రమ్యశ్రీకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన మందా సతీష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో పాప మేధశ్రీని తీసుకొని ఈ నెల 9వ తేదీన రమ్యశ్రీ తన భర్తకు చెప్పకుండా నవభారత్‌లోని పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం సమయంలో భోజనం చేసిన తర్వాత పడుకున్న చిన్నారి నోటిలో నుంచి నురగలు రావడంతో భయపడి పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పరిశీలించగా మృతి చెందిందని నిర్ధారించారు. ఈ విషయం తండ్రి సతీష్‌కు సమాచారం ఇవ్వడంతో చిన్నారి తండ్రి వచ్చి పాల్వంచ పట్టణ పోలీసులకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

బూర్గంపహాడ్, జనవరి 17: బూర్గంపహాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈవో యదుసింహరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి పిల్లలు చేరుకోవాలన్నారు. ఈ పరీక్షకు 170 మంది హాజరవుతున్నారని, ప్రవేశ పరీక్ష నిర్వహణకు 8 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌గా జీహెచ్ఎస్ హెచ్ఎం రవిలాదేవి, అబ్జర్వర్‌గా తాను వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలి

అన్నపురెడ్డిపల్లి, జనవరి 17: మండల కేంద్రంలో రూ.5కోట్లతో ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ పనులను 50 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు లోశెట్టి భూపతిరావు, ముత్యాల గోవిందరావు, చీపు నవీన్ కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను గ్రామస్తులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు పాడియా సతీష్, పాడియా చెన్నారావు, బాణావత్ నాగేశ్వరరావు, గజ్జా సతీష్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు బీఆర్‌టీయూ కార్యాలయం ప్రారంభం

బూర్గంపహాడ్, జనవరి 17: ఐటీసీ గుర్తింపు ఎన్నికల సంఘం నేపథ్యంలో సారపాకలో బీఆర్‌టీయూ ఎన్నికల కార్యాలయాన్ని ఈ ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ.రాంబాబు యాదవ్ శనివారం ప్రారంభిస్తారని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఈస్ట్‌గేట్ ఎదురుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, కార్మికులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

భద్రాచలం, జనవరి 17: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజీ, లయన్స్‌క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవీ అసోసియేషన్ యూఎస్ఏ సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాల ఆవరణలో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. 903 మందికి పరీక్షలు నిర్వహించి పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారిచే కంటి ఆపరేషన్లు చేశారు. శుక్రవారం నేత్ర శస్త్రచికిత్సలు చేయించుకున్న 903 మందికి రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ శ్రీరాములు చేతులమీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం, జనవరి 17: మండల పరిధిలోని టి.కొత్తగూడెంలో కారం చెంచయ్య ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమై నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం ఇంటి సామగ్రి, కొంత నగదు అందజేశారు. ప్రభుత్వం తరపున న్యాయం చేసి కుటుంబానికి అండగా ఉంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చండ్రుగొండ, జనవరి 17: గ్రామాల్లో ఎవరికి వారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం దామరచర్ల గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో పర్యటించి ఇండ్ల పరిసరాల్లో నిల్వనీటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

నేడు ఫైనల్‌లో సారపాక, కొత్తగూడెం జట్లు

బూర్గంపహాడ్, జనవరి 17: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో యూసఫ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు శనివారం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో ఉదయం మొదటి మ్యాచ్ మణి లెవన్ (సారపాక), గుంటుపల్లి లెవన్(సారపాక) జట్లు తలపడ్డాయి. మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీఫైనల్‌లో ఫరీద్ లెవన్ కొత్తగూడెం, చేజింగ్ లెవన్ పాల్వంచ జట్లు తలపడగా ఫరీద్ లెవన్ కొత్తగూడెం జట్టు ఫైనల్‌కు చేరుకుంది. క్రీడాకారులకు